నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, సోమవారం 3 ఫిబ్రవరి 2025 VIKARABAD




బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను ఆదివారం తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి, అతడి సోదరుడితో వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి, రానున్న ఎన్నికల్లో విజయం సాధించేందుకు నిర్వహించే కార్యక్రమాలపై మాట్లాడినట్లు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తెలిపారు.

- తాండూరు

### చెరువులు కబ్జా అవుతున్నాయి..



కేసీఆర్ ప్రభుత్వం చెరువుల సుందరీకరణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. బీఆర్ఎస్ హయాంలో చెరువుల బ్యూటిఫికేషన్ పనులు కొనసాగినప్పటికీ.. తదనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ పనులను పూర్తిగా నిలిపేసింది. దీంతో పలు చెరువులు కబ్జాలకు గురవుతు న్నాయి. చెరువులు ఆక్రమణలకు గురి కాకుండా ఉండేందుకు వెంటనే సుందరీకరణ పనులను చేపట్టాలి.

–సత్తు వెంకటరమణారెడ్డి,
గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్

### సుందరీకరణ చేపట్టాలి..



చెరువుల సుందరీకరణకు గత ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. పలుచోట్ల సుందరీకరణ పనులు 50 శాతం వరకు పూర్తైనా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులను కొనసాగించకపోవడం విడ్డూరం. చెరువులను సుందరీకరిస్తే ప్రజలకు మేలు జరగడంతోపాటు పర్యాటకుల తాకిడి కూడా పెరుగుతుంది. రేవంత్ సర్కార్ ఆ పనులపై దృష్టి సారించాలి.

– మైలారం విజయ్‌కుమార్,
బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి

# వ్యాపారులే లక్ష్యం

## స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైన బల్దియా

**ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోని వారిపై నజర్**

**భారీ పెనాల్టీకి చర్యలు**




సిటీబ్యూరో, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో వాణిజ్య సంస్థలు, వ్యాపారస్తులను జీహెచ్ఎంసీ టార్గెట్ చేసింది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. ప్రాపర్టీ ట్యాక్స్ డేటాబెస్ ఆధారంగా 317033 మంది కమర్షియల్ కేటగిరీలో ఆస్తి పన్ను చెల్లిస్తుండగా, వీరంతా ట్రేడ్ లైసెన్స్‌ల జాబితాలోకి రావాల్సి ఉంది. కానీ కేవలం లక్షా 9వేల 702 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లిస్తున్నట్లు అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలోనే ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోని వారిపై బల్దియా దృష్టి సారించింది. గ్రేటర్‌లో వ్యాపార సంస్థలకు జీహెచ్ఎంసీ జారీ చేసే ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన జనవరి 31తో ఉచితంగా రెన్యువల్ చేసే గడువు ముగిసింది. ఫిబ్రవరి 1 నుంచి రెన్యువల్ చేసుకోనున్న ట్రేడ్ లైసెన్స్‌లపై ఫీజులో 25 శాతాన్ని పెనాల్టీ వేయనున్నారు. మార్చి ప్రారంభం నుంచి నెలాఖరు వరకు 50 శాతం జరిమానాగా వసూలు చేయనున్నారు. ఏప్రిల్ నుంచి రెన్యువల్ చేసుకునే వ్యాపారుల నుంచి చెల్లించాల్సిన ట్రేడ్ ఫీజులో వంద శాతం జరిమానా వసూలు చేయనున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 30 సర్కిళ్లలో ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తించి వారి నుంచి ముక్కు పిండి ఫీజులు వసూలు చేయనున్నారు. మెడికల్ ఆఫీసర్, లైసెన్సింగ్ ఆఫీసర్ ప్రతి రోజూ కనీసం 20 వ్యాపార సంస్థలను నేరుగా కలిసి ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్‌కు చర్యలు చేపట్టనున్నారు.




**ఉనికిని కోల్పోతున్న రంగారెడ్డి జిల్లాలోని పలు చెరువులు**

**గత కేసీఆర్ ప్రభుత్వం చెరువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు**

**వాటిని సుందరీకరించడం, హద్దుల గుర్తింపునకు రూ. కోట్లాది నిధులు**

**ప్రభుత్వం మారడంతో ఎక్కడికక్కడ నిలిచిన పనులు**

**యథేచ్ఛగా ఆక్రమణలు.. కుంచించుకుపోతున్న చెరువులు**

# సుందరీకరణకు మంగళం

**జిల్లాలోని హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న పలు చెరువుల సంరక్షణ, సుందరీకరణకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం భారీగా నిధులు కేటాయించింది. అయితే అసెంబ్లీ ఎన్నికలొచ్చి.. రేవంత్ సర్కార్ అధికా రంలోకి రావడంతో తటాకాల బ్యూటిఫికేషన్, పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడం, చెరువుల హద్దుల గుర్తింపు వంటి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. టెండర్లు పూర్తైన పనులనూ చేపట్టకుండా వదిలేశారు. దీంతో పలు చెరువులు కబ్జాలకు గురై తమ ఉనికిని కోల్పోతున్నాయి.**

**-రంగారెడ్డి, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ)**

### కోట్లాది రూపాయల నిధులు..

జిల్లాలోని నగర శివారులో విస్తరించి ఉన్న పలు చెరువులను గత బీఆర్ ఎస్ ప్రభుత్వం మొదటి విడత సుందరీకరణ పనులకు ఎంపిక చేసి నిధు లు విడుదల చేసింది. వాటిలో ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు రూ. 18 కోట్లు, తుర్కయాంజాల్ మాసబ్‌చెరువుకు రూ. 8 కోట్లు, మీర్‌పేట పెద్దచెరువుకు రూ. 4 కోట్లు, అల్మాస్‌గూడ కోమటికుంటకు రూ. 2 కోట్లు, పోచమ్మకుంటకు రూ. కోటి, జల్‌పల్లి పెద్దచెరువుకు రూ. 3 కోట్లు, రావిర్యాల పెద్ద చెరువుకు రూ.4 కోట్లు కేటాయించింది. ఇబ్రహీంపట్నం పెద్దచెరువు కట్టను వెడల్పు చేయడంతోపాటు పర్యాటకులను ఆకట్టుకునేలా చెరువుకట్టపై పూల మొక్కల పెంపకం, వాకర్ పార్కు, చెరువులో బోటింగ్ , రిసార్ట్‌ల నిర్మాణానికి రూ. 18 కోట్లను కేటాయించింది. ఈ నిధులకు సంబంధించి హెచ్ఎండీఏ టెండర్లను కూడా పూర్తి చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికలొచ్చి.. ప్రభుత్వం మారడంతో ఇప్పటివరకు చెరువు సుం దరీకరణకు సంబంధించి ఏ ఒక్క పని కూడా ప్రారంభం కాలేదు. అలాగే, మీర్‌పేట, అల్మాస్‌గూడ, జల్‌పల్లి, రావిర్యాల వంటి చెరువుల వద్ద చేపట్టి న పనులనూ అర్ధాంతరంగా నిలిపివేశారు. ఆ పనులపై హెచ్ఎండీఏ అధికారులు దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



### చెరువులు.. కబ్జాల పరం

జిల్లాలోని చెరువులు ఆక్రమణకు గురవుతున్న నేపథ్యంలో హైడ్రా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి కబ్జాలకు చెక్ పెడుతున్నారు. గత ప్రభు త్వం ఆక్రమణలకు ఆస్కారం ఇవ్వొద్దన్న ఉద్దేశంతో చెరువుల సుం దరీకరణతోపాటు చెరువుల చుట్టూ జాలి కంచె వేసింది. అయితే బ్యూటిఫికేషన్ పనులు నిలిచిపోవడంతో శివారు ప్రాంతాల్లోని చెరువులు పెద్ద ఎత్తున కబ్జాలపరం అవుతున్నాయి. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాసాబ్‌చెరువు విస్తీర్ణం సుమారు 600 ఎకరాల వరకు ఉంటుంది. చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం 300 ఎకరాల వరకు కుంచించుకుపోయింది. రావిరాల పెద్దచెరువులో బ్యూటిఫికేషన్ పనులు ప్రారంభించినా అవికూడా అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం చెరువులను పట్టించుకోకపోవడంతో శివారులోని చెరువులు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయి. ఇటీవల, హైడ్రా కమిషనర్ రంగనాథ్ కుంట్లూరు చెరువు, తుర్కయాంజాల్ మాసబ్‌చెరువు, ఇబ్రహీంపట్నం పెద్దచెరువులోని ఆక్రమణలను గుర్తించారు.





**ఏడాది గడిచినా అమలు కానీ సీఎం హామీ**

**రంగారెడ్డిజిల్లాలో 2.08 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు**

**బీఆర్ఎస్ హయాంలో రూ.200 నుంచి రూ.2వేలకు పెంచిన కేసీఆర్**

**ప్రస్తుత ప్రభుత్వంలో రూ.4వేల పింఛన్ పెంపు కోసం ఎదురుచూపు**

**ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటున్న లబ్ధిదారులు**

# ఆసరా పెంపు ఏదీ?

**కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఆసరా పింఛన్లను రూ.4వేలకు పెంచుతామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అరకొర పింఛన్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధినేత కేసీఆర్ ఆసరా పెంచి లబ్ధిదారులకు కొండంత అండగా నిలిచారు. జిల్లాలో సుమారు 2 లక్షలకు పైగా లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అప్పట్లో రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.1000కి పెంచారు. రెండో విడుత అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం రూ.2వేలకు పింఛన్‌ను పెంచి వృద్ధులకు భరోసానిచ్చారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ ఇచ్చిన పింఛన్లే ఇస్తున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.4వేలు ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.**

**- షాబాద్, ఫిబ్రవరి 2**

### ఏడాదిగా ఎదురుచూపు !



జిల్లా వ్యాప్తంగా ఏడాదిగా పింఛన్ల పెంపు కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని 25 మండలాల్లోని గ్రామాల్లో మొత్తం 2.08 లక్షల మంది ఆసరా పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, వితంతువులు, గీత, చేనేత, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.2016, దివ్యాంగులకు రూ.4016 పింఛన్‌ను పంపిణీ చేసింది. ఎన్నికల సమయంలో పింఛన్లను పెంచుతామని అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సంక్రాంతి పెంచిన పింఛన్లు వేస్తారేమోనని ఆశించినా లబ్ధిదారులకు నిరాశే మిగిలింది.

### రూ.4 వేల పింఛన్ ఎప్పుడిస్తది..



కాంగ్రెస్ ప్రభుత్వం రూ.4 వేలు ఎప్పుడిస్తదో అర్థం కావడం లేదు. ఎన్నికలప్పుడు పింఛన్ పెంచుతామని చెప్పి మాట తప్పుతున్నరు. మాజీ సీఎం కేసీఆర్ ఠంచన్‌గా రూ.2 వేల 16 ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా పింఛన్ ఊసెత్తడం లేదు. అబద్ధాలు చెప్పి గద్దెనెక్కారు. రాబోవు రోజుల్లో తగిన బుద్ధి చెబుతాం.

– బేగరి మల్లయ్య, అంతారం గ్రామం,
చేవెళ్ల మండలం

### ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పింఛన్ పెంచుతామని ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇస్తలేరు. ఇప్పటికీ కేసీఆర్ ఇచ్చిన రూ.2 వేల పింఛనే ఇస్తుండ్రు. కాంగ్రెసోళ్లు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేసి ఓట్లు వేయించుకుండ్రు. మళ్లీ ఎన్నికలొస్తే ఏ మొఖం పెట్టుకుని వస్తరు. కేసీఆర్ రూ. 2 వేలు ఇస్తే... మేం రూ.4 వేలు ఇస్తాం.. అంటూ గొప్పలు చెప్పుకున్నరు. గద్దెనెక్కగానే ముసలోళ్లం యాదిమరిచినమా.. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను పెంచాలి. లేదంటే గుణపాఠం తప్పదు.

– ఎండి.ఇబ్రహీం, సింగప్ప గూడ
గ్రామం, చేవెళ్ల మండలం



మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు

# తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష

- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- వెయ్యి మంది అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నేత గౌడిచర్ల వెంకటేశ్
- గులాబీ వనంగా మారిన జన్వాడ

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 2 : తెలంగాణకు మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడి అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండల పరిధి జన్వాడ గ్రామానికి చెందిన బీజేపీ నేత గౌడిచర్ల వెంకటేశ్ తన అనుచరులు వెయ్యి మందితో కలిసి సబితారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి వారు బీఆర్ఎస్ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. జన్వాడ ప్రాంతమంతా గులాబీమయమైంది. అంతకు ముందు బోనాలు, కోలాటాలు, డప్పుల చప్పుళ్లు, బాణసంచా మోతలతో ఎమ్మెల్యే సబితారెడ్డికి ఘన స్వాగతం పలికారు. భారీ క్రేన్‌తో స్వర్గీయ ఇంద్రారెడ్డి విగ్రహానికి భారీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే.. ఎగిరేది గులాబీ జెండానే అన్నారు. రేవంత్ సర్కార్ ప్రజలకు ఏం చేస్తారో చెప్పడం లేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. ప్రజలు ఇప్పటి వరకు మూడు సార్లు దరఖాస్తులు చేసుకున్నా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. అత్తెసరు రుణమాఫీ చేశారని, రైతు భరోసాకు రాం..రాం చెప్పాలని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్స్ ప్రభుత్వ హయాంలో అదునుకు రైతుబంధు డబ్బులు వచ్చేవన్నారు. 24 గంటల విద్యుత్తు, రోడ్లు, గురుకులాలు, పాఠశాలల భవనాలు, సమీకృత కలెక్టర్ భవనాలను నిర్మించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యులతో సహా జడ్పీ చైర్మన్ల వరకు గులాబీ జెండాలు ఎగురవేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### మున్సిపాలిటీ వద్దు..

జన్వాడను మున్సిపాలిటీలో కలుపొద్దని, గ్రామ పంచాయతీగా ఉంచాలని గ్రామస్తులందరూ ఏకగ్రీవంగా తీర్మానించి ప్రతిజ్ఞ చేశారు. కనీసం మున్సిపాలిటీలో కలిపితే ఒప్పుకొంటాం కానీ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోకి మార్చవద్దని మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గంచెర్ల గోవర్ధన్‌రెడ్డి, ఉద్యమకారుడు దేశమెల్ల ఆంజనేయులు, మాజీ చైర్మన్ నాగేందర్ గౌడ్, శంకర్‌పల్లి సొసైటీ చైర్మన్ శశిధర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కె. నారాయణ, మార్కెట్ మాజీ చైర్మన్ మాణిక్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, బీఆర్ఎస్ నాయకులు గౌడిచర్ల నర్సింహ, నాగేందర్, కేశం గోపాల్, అశోక్, గౌడిచర్ల రాములు, బ్యాగరి సుదర్శన్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, లింగం, ఎజాస్, పీ సురేశ్, కే శ్రీను, సీహెచ్ వీరయ్య, జాఫర్, ఏ రాములు, నర్సింహారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.